సాక్షి కామారెడ్డి

సోమవారం । 15 । జూలై । 2024



ఘనంగా బోనాలు

జిల్లాలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

- 9లో ▸



కాగితాల్లోనే 'నో బ్యాగ్ డే'

ప్రతి నెలా నాలుగో శనివారం అమలు కావాల్సిన 'నోబ్యాగ్ డే' కాగితాలకే పరిమితమైంది. విద్యార్థులకు మోత తప్పడం లేదు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.6 /23.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి'



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ సాయినాథ్ కోరారు. ఆదివారం భిక్కనూరు మండలంలోని నగరేశ్వ రాలయంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచమంతా మన సంస్కృతి సంప్రదాయలపై ఆసక్తి చూపుతోందన్నారు. విదేశీయులు మన ఆచార వ్యవహారాలపై అభిమానం పెంచుకుంటుండగా మనవాళ్లు కొందరు విదేశీ సంస్కృతికి ఆకర్షితులవుతుండడం శోచనీయమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశ సంస్కృతి సంప్రదాయల పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. స్వయం సేవకులు రోజూ శాఖకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు గొల్ల రమేష్, కుమార్, సాయికుమార్, కిరణ్, లక్ష్మణ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో ప్రతిభ

- రన్నర్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టు



కల్వకుర్తి టౌన్ : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన తెలంగాణ 10వ రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాలమూర్ విజేతగా నిలవగా నిజామాబాద్ జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన సెమీ ఫైనల్‌లో నాలుగు జట్లు తలపడగా.. మహబూబ్‌నగర్, నిజామాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు నిజామాబాద్‌పై 1-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. మహబూబ్‌నగర్ జట్టుకు మెడల్స్‌తో పాటు ట్రోఫీని రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫాల్గుణ ప్రదానం చేశారు. రన్నరప్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టుకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అందజేశారు.

స్విమ్మింగ్‌లో రిత్వికకు బంగారు పతకాలు



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి మిట్టపల్లి రిత్విక బంగారు పతకాలు సాధించింది. గ్రూప్-1 బాలికల విభాగంలో పాల్గొన్న రిత్విక 50, 100, 200 మీటర్ల బెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకం, 50 మీటర్ల బటర్ ఫ్లైలో బ్రాంజ్ మెడల్, 200 మీటర్ల ఐఎంలో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననుంది. అనంతరం పతకాలు సాధించిన రిత్వికను రాష్ట్ర సిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేశ్, ఉపాధ్యక్షుడు జి మైపాల్ రెడ్డి అభినందించారు.





కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన ఆకుల రమేశ్ ఏప్రిల్ 28న మలేషియాలో గుండెపోటుతో చనిపోయాడు.

రాజంపేట మండల కేంద్రానికి చెందిన జొన్నల రవి (38) జనవరి 17న దుబాయ్‌లో గుండెపోటుతో చనిపోయాడు. రవికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మాచారెడ్డి మండలం కాకులగుట్ట తండాకు చెందిన భూక్య భాస్కర్ (25) మే 20న దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అతడికి వివాహం కాలేదు. తల్లిదండ్రులు ఉన్నారు.

సదాశివగనర్ మండల కేంద్రానికి చెందిన పోలబోయిన నారాయణ (50) కొన్నేళ్లుగా సౌదీకి వెళ్లవస్తున్నాడు. కంపెనీ వేతనం సరిగా ఇవ్వపోవడంతో మనోవేదనకు గురైన నారాయణ కొన్నాళ్ల క్రితం గుండెపోటుకు గురై మరణించాడు. ముగ్గురు కుమారులలో ఇద్దరు అనారోగ్యంతో చనిపోయారు. భార్య, ఇంకో కుమారుడు ఉన్నారు.

గాంధారి మండల కేంద్రానికి చెందిన చాకలి పోచయ్య (50) ఫిబ్రవరి 17న సౌదీలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన చాలా ఏళ్లుగా గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. మూడు నెలల సెలవుపై ఇండియాకు వచ్చిన పోచయ్య.. సౌదీ వెళ్లిన వారం రోజులకే ఉరేసుకుని చనిపోయాడు.

ఎడారి దేశంలో చితికిపోతున్న బతుకులు

- ఆరు నెలల్లో ఇరవై మంది జిల్లావాసుల మృత్యువాత
- గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు..
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

ఉన్న ఊళ్లో ఉపాధి కరువై.. బతుకుదెరువుకోసం భార్యాబిడ్డలు, బంధు మిత్రులను వదిలి ఎడారి దేశాలకు వలస వెళుతున్న కొందరి జీవితం అర్ధంతరంగా ముగుస్తోంది. కుటుంబానికి దూరంగా ఉండాల్సి రావడంతో మనోవేదనతో కొందరు గుండెపోటుకు గురై మరణిస్తుండగా.. సరైన ఉపాధి లభించక అప్పులు భారమై మరికొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఈ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

సాక్షి, కామారెడ్డి: గల్ఫ్ దేశాలలో ఇటీవలి కాలంలో మరణాల సంఖ్య పెరిగింది. ఆరు నెలల్లో జిల్లాకు చెందిన 20 మంది వివిధ కారణాలతో చనిపోయారు. కొందరు దశాబ్దాల క్రితమే గల్ఫ్ దేశాలకు వెళ్లి సెలవు దొరికినపుడు ఇంటికి వచ్చి కుటుంబంతో రెండు, మూడు నెలలు గడిపి తిరిగి వెళుతుండగా.. మరికొందరు ఐదారేళ్లు వెళ్లి నాలుగు డబ్బులు సంపాదించుకుని ఇంటికి వచ్చి ఏదైనా దందా చేసుకుందామని వెళుతుంటారు. అయితే కుటుంబాలకు దూరంగా ఉండడం, ఆర్థిక సమస్యలు, పిల్లల చదువులు, పెళ్లిళ్లకు డబ్బులు సర్దుబాటు చేయడం... ఇలా కారణం ఏదైతేనేం చాలా మంది మానసిక సంఘర్షణకు గురై గుండెపోటుతో చనిపోతున్నట్టు తెలుస్తోంది. ఒకరిద్దరు ఒత్తిడితో గల్ఫ్ దేశాల్లోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరికొందరు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు వదులుతున్నారు. అక్కడ చనిపోయిన వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోంది.



1: భూక్య భాస్కర్
2: చాకలి పోచయ్య
3: జొన్నల రవి
4: ఆకుల రమేశ్
5: నారాయణ

ఆదుకోని ప్రభుత్వాలు

గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి అక్కడ చనిపోయిన వారి కుటుంబాల విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి సాయం అందించడం లేదు. దీంతో వారి కుటుంబాలకు ఆధారం లేకుండాపోతోంది. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు గల్ఫ్ సమస్యను ఎజెండాగా చేసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. అయితే ఎన్నికల తర్వాత హామీలను పట్టించుకోవడం లేదు. దీంతో గల్ఫ్ బాధిత కుటుంబాల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. గల్ఫ్ దేశాల్లో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

పెద్ద దిక్కును కోల్పోయి..

ఊళ్లో కనీసం వ్యవసాయ భూములు లేకపోవడం, ఉన్నా నీటి సౌకర్యం లేకపోవడం, వ్యవసాయం అనుకూలించని పరిస్థితుల్లో చాలా మంది గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్నారు. కుటుంబ ఉన్నతి కోసం ఎడారి దేశాలకు వలస వెళ్లిన ఇంటి పెద్ద అనుకోని పరిస్థితుల్లో తనువు చాలించడంతో వారిపై ఆధారపడినవారు ఇక్కడ రోడ్డున పడుతున్నారు. కుటుంబాన్ని వదిలి అంతదూరం వెళ్లిన వారు తిరిగి శవమై రావడంతో ఆ కుటుంబాలకు కన్నీరే మిగులుతోంది.

చనిపోయిన వారి మృతదేహాలను తీసుకు రావడానికి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఒక వైపు, అప్పుల భారం మరోవైపు కుటుంబాలను మరింత కుంగదీస్తోంది. వివిధ కారణాలతో చనిపోతున్న వారిలో చాలామంది 25 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. వారి పిల్లలు స్కూలుకు వెళ్లే వయసు వారే కావడంతో భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతోంది.

దూసుకొచ్చిన మృత్యువు

గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను చూడటానికి వచ్చిన వారి మీదకు కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. అంతవరకు సంతోషంగా తమ పిల్లలతో గడిపిన వారి జీవితాలలో విషాదాన్ని నింపింది. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల బాలికల పాఠశాల వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.



పద్మ మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త శంకర్





గాయపడ్డ ఈశ్వరి, గౌతమి





మృతులు పద్మ, పోశవ్వ (ఫైల్)

- పిల్లలను చూసేందుకు గురుకులానికి వచ్చిన కుటుంబ సభ్యులు
- వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరి మృత్యువాత
- మరొకరి పరిస్థితి విషమం
- దాస్‌నగర్ వద్ద ఘటన

నిజామాబాద్‌నాగారం/మాక్లూర్: మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతీబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థినులు చదువుకుంటున్నారు. వీరిని కలవడానికి కుటుంబ సభ్యులకు ప్రతి నెల రెండో ఆదివారం అనుమతిస్తారు. పిల్లలను చూసేందుకు ఈ ఆదివారం వారి కుటుంబ సభ్యులు వచ్చారు. బోధన్ మండలంలోని చిన్నమావందికి చెందిన ఈశ్వరి ఇదే గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమెను చూడడానికి తల్లి పద్మ, తండ్రి శంకర్, అక్క గౌతమి వచ్చారు. ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లికి చెందిన హారిక తొమ్మిదో తరగతి చదువుతోంది. హారికను చూడడానికి ఆమె అమ్మ నీల, అమ్మమ్మ పోశవ్వ వచ్చారు. గురుకులానికి వచ్చిన వారు తమ పిల్లలను బయటికి తీసుకువెళ్లి కాసేపు సరదాగా గడిపారు. అనంతరం పాఠశాలలోనికి పంపించడానికి రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా.. నందిపేట్ నుంచి నిజామాబాద్‌వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టి బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో చిన్నమావందికి చెందిన పద్మ(37) అక్కడికక్కడే మృతిచెందగా.. ఆమె కూతురు ఈశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో కూతురు గౌతమికి గాయాలయ్యాయి. ఇదే ఘటనలో సిర్నాపల్లికి చెందిన పోశవ్వ(60) మరణించగా.. ఆమె కూతురు నీల, మనవరాలు హారిక గాయాలపాలయ్యారు.

ఆలస్యంగా వచ్చిన అంబులెన్సు

రోడ్డు ప్రమాదం మధ్యాహ్నం 2.10 గంటల ప్రాంతంలో జరిగింది. పోలీసులు అరగంట తర్వాత సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన గంటవరకు అంబులెన్స్ రాకపోవడంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థులు ఈశ్వరి, గౌతమిలను బైక్‌లపై జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి తరలించారు. గంటన్నర తర్వాత వచ్చిన అంబులెన్సులో హారికను, వాళ్ల అమ్మ నీలను జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

జీజీహెచ్‌లో ప్రథమ చికిత్స మాత్రమే..



క్షతగాత్రులను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఎమర్జెన్సీ విభాగంలో ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు లేరు. జూనియర్ డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన క్షతగాత్రులకు వారు ప్రాథమిక చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడ్డ ఈశ్వరితోపాటు ఆమె సోదరి గౌతమిలను కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

పరామర్శించిన అదనపు కలెక్టర్

ప్రమాద విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ అంకిత్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులను పరామర్శించడానికి జీజీహెచ్‌కు వెళ్లారు. తీవ్రంగా గాయపడిన ఈశ్వరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని ఆర్ఎంవో నరేందర్ చెప్పడంతో ఆయన ఆ ఆస్పత్రికి వెళ్లారు. ఈశ్వరి, గౌతమిలను పరామర్శించారు.

చిన్నమావందిలో విషాదఛాయలు

బోధన్‌రూరల్: చిన్నమావంది గ్రామానికి చెందిన శ్రీరాం పద్మ, శంకర్ దంపతులకు ముగ్గురు కూతుళ్లున్నారు. పెద్ద కూతురు శివాని బోధన్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతుండగా.. రెండో కూతురు గౌతమి ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి, మూడో కూతురు ఈశ్వరి దాస్‌నగర్‌లోని గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో చిన్న కూతురును చూడడానికి తల్లిదండ్రులు పద్మ, శంకర్‌తో పాటు రెండో కూతురు గౌతమి వెళ్లారు. అక్కడ జరిగిన ప్రమాదంలో పద్మ మృత్యువాతపడడం, ఆమె కూతురు ఈశ్వరి పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తల్లి వద్ద ఉంటూ..

ప్రమాదంలో గాయపడిన డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన నీల భర్త గతంలోనే చనిపోయారు. దీంతో ఆమె తన ఇద్దరు కూతుళ్లతో కలిసి ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లిలో తన తల్లి వద్ద ఉంటోంది. గురుకులంలో చదువుతున్న హారికను చూడడానికి ఆమె తల్లి నీలతోపాటు అమ్మమ్మ పోశవ్వ కూడా వెళ్లింది. కారు ఢీకొనడంతో పోశవ్వ అక్కడికక్కడే మరణించడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.



నాడు కళకళ.. నేడు వెలవెల



గతేడాది జూలై 14న ప్రవహిస్తున్న పెద్దవాగు



ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్న వాగు

లింగంపేట: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడిచినా జడి వానల జాడలేదు. దీంతో వాగులు, వంకలు వెలవెలబోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల వరప్రదాయిని అయిన పెద్దవాగు గతేదాది ఇదే రోజున నిండుగా పారింది. ఈసారి చుక్క నీరు లేక వెలవెలబోతోంది. పెద్దవాగు పారితేనే మండలంలో భూగర్భ జలాలు వృద్ధి చెంది బోరుబావుల్లో ఊట పెరుగుతుంది. వర్షాలు లేక మండలంలో 30 శాతం వరి నాట్లు కూడా పడలేదు. వాగు పారకపోవడంతో సాగు పనులు ముందుకు సాగడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

నేడు పెన్షనర్ల జేఏసీ నిరసన

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఉదయం ఉదయం 11గంటల నుంచి ఒంటిగంట వరకు నిరసన తెలుపనున్నట్లు జేఏసీ జిల్లా కన్వీనర్ వి.హన్మంత్‌రెడ్డి, రాష్ట్ర సలహాదారు జి.లచ్చయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

ఉపాధి కోసం మహిళా శక్తి

- లబ్ధిదారుల ఎంపికకు మొదలైన కసరత్తు
- ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సర్కారు ప్రోత్సాహం



సాక్షి, కామారెడ్డి: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఎన్నికల సమయంలో ప్రకటించిన వరాల్లో కొన్నింటిని ప్రారంభించగా, మరికొన్నింటిని చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మహిళాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా 17,960 యూనిట్లు మంజూరు చేసి, 22,007 మందికి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. దీనికిగాను స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ కింద రూ.186.42 కోట్ల రుణాలు ఇవ్వనున్నారు. జిల్లాలో 10,413 మైక్రో ఎంటర్‌ప్రైజెస్, 131 స్టిచ్చింగ్ సెంటర్లు, ఐదు చోట్ల క్యాంటీన్లు, ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఒక ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, 5 వేల పాడి పశువులు, 2,200 పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు, పౌల్ట్రీ మదర్ యూనిట్స్ 22, మొబైల్ ఫిష్ రిటైల్ ఒకటి, మిల్క్ పార్లర్ ఒకటి, 160 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పది కస్టమైరింగ్ సెంటర్లు, 14 మీ సేవ కేంద్రాలు, సోలార్ యూనిట్ ఒకటి మంజూరు చేసింది.

లబ్ధిదారుల ఎంపికపై దృష్టి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 14 చోట్ల మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో చురుకైన స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి వారికి మీ సేవ కేంద్రాలు అప్పగిస్తారు. జిల్లా కలెక్టరేట్‌లో అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవతో జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. అదే నమూనాలో జిల్లాలోని ఐదు చోట్ల ప్రభుత్వ కార్యాలయాల వద్ద క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, గాంధారి మండల కేంద్రాల్లో క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు. మిగతా యూనిట్లకు సంబంధించి కసరత్తు జరుగుతోంది. ఆయా యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడంపై అధికారులు దృష్టి సారించారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

మహిళలకు అందిస్తున్న యూనిట్ల ద్వారా వారు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తోంది. వాటికి కావాల్సిన మార్కెటింగ్ సదుపాయాలు, శిక్షణ వంటివి కూడా సమకూరుస్తోంది. తద్వారా వారు తాము తీసుకున్న యూనిట్లను విజయవంతంగా నడిపించి సక్సెస్ సాధించేలా కృషి చేస్తున్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో విజయవంతం చేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

బోనమెత్తిన బాన్సువాడ



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



బోనం తీసుకెళ్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

బాన్సువాడ : గ్రామ దేవతల శరణువేడుతూ బాన్సువాడ బోనమెత్తింది. పట్టణంలో కనకదుర్గాదేవి బోనాల మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాత బాన్సువాడ చావిడి నుంచి మహిళలు బోనాలతో శోభాయాత్రగా దుర్గాదేవి ఆలయానికి వచ్చారు. దుర్గాదేవికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జల, పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారిని పసుపు, కుంకుమ, భస్మం, గంధంతో అలంకరించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు పుష్కలంగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పుష్పమ్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. తాడ్కోల్ శివారులో ఉన్న డబుల్ బెడ్ రూం కాలనీలో బోనాల పండుగ నిర్వహించారు. మహిళలతో పాటు ఎమ్మెల్యే దంపతులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

క్లుప్తంగా

బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శిగా రమణారావు



బాన్సువాడ రూరల్ : బ్రాహ్మణ సంఘం కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా కోనాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరమణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు దామరంచ గ్రామానికి చెందిన ప్రదీప్‌కులకర్ణి జిల్లా ఉపాధ్యక్షులుగా, కాశీనాథ్‌రావు సలహాదార్లుగా ఎన్నికయ్యారు. వీరిని బాన్సువాడ మండల అధ్యక్షులు చంద్రకాంత్‌రావు తన కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. త్రివిక్రంరావు, రమేశ్‌రావు, రామారావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ గురువును గౌరవించాలి



మద్నూర్(జుక్కల్) : ప్రతిఒక్కరూ గురువును గౌరవించాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవహ రాజులువార్ దిగంబర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ ఆలయంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి గురువు చాలా అవసరమన్నారు. నేటి యువత రేపటి దేశ మార్గనిర్దేశకులుగా తయారు కావాలని క్రమశిక్షణ, నిజాయితీతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ సత్యనారాయణ, జుక్కల్ ఖండా కార్యవాహ సంజీవ్,స్వయం సేవకులు,గ్రామస్తులుపాల్గొన్నారు.

ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

బాన్సువాడ రూరల్ : ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డా అయ్యాల సంతోష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉన్నందున సరైన బోధన అందడం లేదన్నారు. ఎస్జీటీలను రిలీవ్ చేసి వారి స్థానాల్లో విద్యావాలంటీర్లను నియమించాలని ఆయన సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలన్నారు. అలాగే సాంకేతిక లోపం వల్ల నష్టపోయిన సీనియర్ ఉపాధ్యాయులకు మరోసారి స్లైడింగ్ అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంలను , ప్రతి మండలానికి ప్రత్యేకంగా ఒక్కరి చొప్పున ఎంఈవోలను నియమించాలని డిమాండ్ చేశారు.

డాక్టరేట్ సాధించిన యువకుడికి సన్మానం



భిక్కనూరు : డాక్టరేట్ పట్టా సాధించిన భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన గుర్రల ప్రవీణ్ కుమార్‌ను చిన్ననాటి స్నేహితులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువతో పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదాం కృష్ణ, రమేష్, మజీద్, శాదుల్, మహమ్మద్, బాల్‌నర్సింలు, సిద్ధరాములు, పెంటయ్య, శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

శ్రీరామా.. కరుణించవా!

- నీరులేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ
- జూలైలో నగం రోజులు గడిచినా నిరాశజనకంగానే..
- ముదురుతున్న వరి నారు
- ఆందోళనలో అన్నదాతలు



నీరు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీరు లేక వెలవెల బోతుంది. దీంతో ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు శ్రీరామా.. కరుణించవా అంటు వేడుకుంటున్నారు. జూలై మధ్య మాసం దాటినా ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు చేరలేదు. గరిష్టంగా 4900 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చి చేరింది. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 12.7 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్ట్ ప్రస్తుత నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలు. అంటే మరో 68 టీఎంసీల నీరు వస్తేనే ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుంది. ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టులు కూడా ఖాళీగా ఉండటంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన తీవ్రమవుతోంది. గతేడాది జూలై నుంచే వరదలు ప్రారంభమాయ్యయి. జూలై చివరి నాటికి ప్రాజెక్ట్ నిండుకుండల మారింది. కానీ ఈ ఏడాది కనీసం 10 వేల క్యూసెక్కుల వరద కూడ చేరలేదు. ఎగువన ప్రాజెక్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు వరదలు వచ్చేఅవకాశం లేదని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు కరుణిస్తే రెండు రోజుల్లో ప్రాజెక్టు నిండుకుండలా మారిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతే కాకుండా సెప్టెంబర్ వరకు వరదలు రాకుండా ఒక్క పంటకే ఆయకట్టుకు నీరు ఇచ్చిన సందర్భాలు సైతం ఉన్నాయి.

వరి నారు సిద్ధం

గతేడాది మాదిరిగానే జూలైలోనే వరదలు వచ్చి ప్రాజెక్ట్ నిండుకుండల మారుతుందని ఆశించిన రైతులు గత నెల రోజుల నుంచే వరి నారు మడులు సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి నారు నెల రోజుల్లో నాటుకోవాలి. కానీ ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీరు లేక పోవడంతో కాలువల ద్వారా నీటి విడుదల లేదు. దీంతో ప్రధాన పొలాలు నీరు లేక ఖాళీగానే ఉంటున్నాయి. ఎస్సారెస్పీ కాలువల ఆధారంగా 18 లక్షల ఆయకట్టు సాగవుతుంది. ప్రస్తుతం ఏ కాలువ ద్వారా నీటి విడుదల చేసే అవకాశం లేదు. ఎస్సారెస్పీలోకి కనీసం 56 టీఎంసీల నీరు వచ్చి చేరితే ఏదైన అవకాశం ఉంటుందని ప్రాజెక్ట్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీలోకి 3183 క్యూసెక్కుల నీరు

ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో 3183 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి 479 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.20(12.78 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటున్నారు.



ముదురుతున్న నారు



నీరు లేక ఖాళీగా ఉన్న పొలం

మళ్లీ మొదటికి.. పట్టించుకోని యంత్రాంగం



రెంజల్ శివారులోని విలువైన ప్రభుత్వ భూమిని దమ్ము చేయించిన కబ్జాదారు

- ఖరీదైన ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం
- అధికారి మారడంతో తిరిగి భూమిలో సాగుకు యత్నం

రెంజల్: అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు కలిసి వస్తోంది. రెవెన్యూ భూమిని కాపాడుకోవాల్సిన సంబంధిత అధికారులు మొద్దు నిద్రను వదలక పోవడంతో కబ్జాదారులు తిరిగి ఆ భూమిలో పాగ వేసేందుకు యత్నిస్తున్నారు. రెంజల్ శివారులోని ఖరీదైన భూమిని కబ్జా చేసేందుకు అక్రమార్కులు పోటీపడుతున్నారు. 340 సర్వే నంబరులో 64 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రెవెన్యూ కార్యాలయం, సబ్‌స్టేషన్లు రెండు, మైనార్టీ గురుకుల పాఠశాల, కేజీబీవీ, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ గిడ్డంగి, ఆదర్శ పాఠశాల, హాస్టల్‌తో పాటు మరి కొన్ని శాఖల అతిథి గృహాలను నిర్మించారు. మిగులు భూమి నుంచి కొందరు చుట్టు పక్కల రైతులు భూములను ఆక్రమించుకోగా ఆదర్శ పాఠశాల ముందు భాగంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న 340/2లో 3 ఎకరాల 30 గుంటల భూమి ఉంది. ఏళ్ల తరబడి బీడుగా ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరి కన్ను పడింది. మార్కెట్‌లో భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారులు వాలిపోయారు. నిజామాబాద్‌కు చెందిన ఒకరు రెండెకరాల అక్రమ పట్టాను సృష్టించి సాగుకు సిద్ధమవగా రెంజల్, వీరన్నగుట్ట గ్రామాలకు చెందిన ఇద్దరు మిగిలిన భూమిలో పాగవేశారు. భూమి తమదంటే తమదని ఘర్షణ పడి పోలీసు కేసుల వరకు వెళ్లారు.

అధికారి మారడంతో..

విలువైన ప్రభుత్వ భూమి కబ్జాపై గతంలో 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించడంతో మాజీ జడ్పీటీసీ మేక విజయ విషయాన్ని జడ్పీ సమావేశంలో ప్రస్తావించారు. దీంతో నాటి తహశీల్దార్ సర్వే చేయించి భూమిలో సాగు పనుల చేయవద్దని కబ్జాదారులను పిలిపించి మందలించారు. భూమి వద్ద బోర్డు ఏర్పాటు చేయిస్తానని నాటి తహసీల్దార్ రాంచందర్ మండల సర్వసభ్య సమావేశంలో మాటిచ్చి మర్చిపోయారు. నాటి నుంచి స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు తహసీల్దార్ ఇటీవల బదిలీ కావడంతో తిరిగి భూమిని ఆక్రమించుకుని చదును చేయిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్నా స్థానిక అధికారుల్లో ఖరీదైన భూమిని కాపాడాలనే చిత్త శుద్ధి కనిపించడంలేదు. ఈ విషయమై ప్రస్తుత తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను ఆదివారం వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బ్యాక్‌లాగ్ పరీక్షలకు 25 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ వన్‌టైం ఛాన్స్ బ్యాక్‌లాగ్ 5, 6వ సెమిస్టర్ పరీక్షల్లో ఆదివారం 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), ఎస్‌ఆర్‌ఎస్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు 177 మందికి 166 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 211 మందికి 197 మంది హాజరు కాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె రాంమోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ డివిజన్ కమిటీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తూ మొండిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం పీఆర్సీ, బకాయి డీఏల విడుదల, నగదు రహిత వైద్యం సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి నెలలు గడిచినా వాటిపై స్పందించక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం జిల్లా పాత కలెక్టరేట్ ధర్నా చౌక్ లో ఉదయం ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాకు అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడు వి రామకృష్ణారావు, కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రకాశం, కోశాధికారి సత్యానంద్, ప్రతినిధులు కోటేశ్వర్‌రావు, అద్దంకి లింగయ్య, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లు సీసాలో ఎలుక



లింగంపేట(ఎల్లారెడ్డి): కల్లు సీసాలో ఎలుక వచ్చిన ఘటన మండలంలోని అయిలాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు కల్లు సేవించేందుకు గ్రామంలోని బట్టీకి వచ్చాడు. అందులో కల్లు సేవించే సీసాలో చనిపోయిన ఎలుక కనిపించింది. దీంతో అవాక్కయిన సదరు వ్యక్తితో పాటు గ్రామస్తులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు దుకాణం ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయమై ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐకి సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న మాక్లూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



సమ్మేళనంలో బాల్కొండ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం



తాడ్వాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

బాల్కొండ/ మాక్లూర్/ డిచ్‌పల్లి/ నిజామాబాద్ అర్బన్/ నిజామాబాద్ రూరల్/ తాడ్వాయి: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001, మాక్లూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–2002, జిల్లా కేంద్రంలోని విశ్వశాంతి హైస్కూల్‌లో 2001–2002, శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల(మాణిక‌భవన్)లో 1995–96, మోపాల్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97, తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. ఈ వేడుకలకు స్థానిక పాఠశాలలు, ఫంక్షన్ హాల్లు, హోటళ్లు వేదికగా మారాయి. సమ్మేళనాల్లో పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.



మోపాల్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న శ్రీవిశ్వశాంతి హై స్కూల్ పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న శ్రీనూతన వైశ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

లింగంపేట(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కోమట్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధరణి ఎల్లయ్య(38)కు 14 ఏళ్ల క్రితం ఎల్లారెడ్డిపల్లికి చెందిన వినోదతో వివాహం జరిగింది. వివాహమైన నాలుగేళ్ల తర్వాత వినోద అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి కుమారుడు రాకేశ్ జన్మించాడు. అనంతరం కుటుంబీకులు మర్తమాల గ్రామనికి చెందిన ప్రవీణతో ఎల్లయ్యకు వివాహం జరిపించారు. ఈమెకు మరో కుమారుడు జన్మించాడు. నిత్యం సంసార విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం సాయంత్రం భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో ప్రవీణ ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుల పెద్దల సహాయంతో ప్రవీణను వెతికి ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి 11 గంటల తర్వాత ఎల్లయ్య బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులో చెట్టుకు మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విచారణలో ఎల్లయ్య మృతదేహం తేలింది. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వినాయక్‌నగర్‌లో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్ పీఎస్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో దొంగతనం జరిగినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం సాంబారు వెంకట్ వ్యక్తి తన భార్యతో కలిసి వేములవాడలో ఉన్న కుమార్తె దగ్గరకు వెళ్లారు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దుండగులు రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న ఏడు తులాల బంగారు నగలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో వెంకట్ కుమారుడు శివకుమార్‌కు సమాచారం అందించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో పడిపోయిన గుర్తు తెలియని వ్యక్తి



కామారెడ్డి క్రైం: రైల్వే స్టేషన్‌లో ఫిట్స్ వ్యాధితో పడిపోయిన గుర్తు తెలియని వ్యక్తిని కామారెడ్డి రైల్వే పోలీసులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో ఆదివారం చేర్పించారు. కామారెడ్డి రైల్వే ప్లాట్ ఫాంపై ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన ఎస్సై తావూ నాయక్, సిబ్బంది కలిసి అతడిని ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఎస్సై తెలిపారు. ఎవరైనా అతడిని గుర్తు పడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

పాముకాటుతో ఒకరి మృతి



నాగయ్య(ఫైల్)

ఎల్లారెడ్డి: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కంబం నాగయ్య(45) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయడంతో బాధితుడిని కామారెడ్డికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి



నిజాంసాగర్(జుక్కల్) : ఆదివాసీ నాయక్‌పోడ్ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య అన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆదివాసి నాయక్ పోడ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 9 న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో పండుగలా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టింకటి సాయిబాబ, కార్యదర్శి రమేశ్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సాయిలు, సభ్యులు కాశీరాం, శంకర్, సంజీవ్, భూమయ్య, విఠల్, సిర్నపల్లి సాయిలు, లక్ష్మణ్ ఉన్నారు.

అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబానికి చేయూత



భిక్కనూరు:అవయవదానం చేసిన నిరుపేద యువకుడైన పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మెట్టు ప్రవీణ్ కుటుంబానికి పలువురు ఆదివారం చేయూతనందించారు.కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల నవీన్ రూ.4వేలు అందించగా, శ్రీ ఫౌండేషన్ ప్రతినిధులు రూ. 5వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను అందించారు. రైస్‌మిల్లు యజమాని రమేశ్‌గుప్తా రూ.2,100 అందించారు.మరికొందరు దాత లు సైతం తమకు తోచినంత సాయం అందించారు.

ఇదేం 'లింకు' సారూ..!

- మహిళా సంఘాలు, పంట రుణాలకు లింకు
- పంట రుణాలను రెన్యువల్ చేస్తేనే రుణం డబ్బు చెల్లింపు
- లేదంటే ఖాతాలోనే లాక్ వేస్తున్న బ్యాంకర్లు
- బ్యాంకర్ల మెలికపై మహిళల ఆందోళన

బాల్కొండ: మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకు, స్త్రీ నిధి రుణాలను మంజూరు చేస్తుంది. అలా మంజూరైన రుణాలను బ్యాంకుల ద్వారా చెల్లిస్తారు. కానీ ప్రస్తుత పలు బ్యాంకర్లు కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరున పంట రుణాలు ఉన్నా, మహిళ సంఘాల ద్వారా మంజూరైన రుణం మొత్తానికి లాక్ వేస్తున్నారు. పంట రుణాలను రెన్యువల్ చేస్తేనే రుణం నగదు చెల్లిస్తామని బ్యాంకర్లు మెలిక పెడుతున్నారు. దీంతో మహిళలు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించినా బ్యాంకర్లు ఇలా చేయడంపై మహిళలు పెదవి విరుస్తున్నారు. అవసరాల కోసం మహిళ సమాఖ్య ద్వారా లక్ష రూపాయలు రుణం తీసుకుంటే పంట రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకుంటే రూ. 15 వేలు రుణానికే పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల వ్యవధిలోనే రైతు రుణమాఫీ ఉంటుందని ప్రభుత్వం ప్రకటిస్తున్నా బ్యాంకర్లు ఇలా చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకర్ల నుంచి వివరాలను సేకరిస్తున్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. కానీ బ్యాంకర్లు అవేమి పట్టించుకోవడం లేదు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో ఇలాంటి మెలిక ఎక్కువ జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మహిళా రుణాల మెలిక పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

- రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్‌నాగారం: పద్మశాలీలు రాజకీయంగా ఎదిగేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అనిల్ చైర్మన్ హోదాలో మొదటి సారిగా జిల్లాకు రావడంతో ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని కోటగల్లీలో ఉన్న నగర పద్మశాలి సంఘ భవనంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నగర పద్మశాలి సంఘంతో పాటు వివిద తర్వాల ఆధ్వర్యంలో అనిల్‌కు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాధికారం దిశగా పద్మశాలీలు అడుగులు వేయాలన్నారు. రాబోయే రోజుల్లో పద్మశాలీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని హామీ ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కూడా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పద్మశాలి భవనం కోసం రెండెకరాల భూమి కేటాయింపజేస్తామన్నారు. కార్యక్రమంలో గుజ్జేటి వెంకట్ నర్సయ్య, డి యాదగిరి, పుల్లం హన్మాండ్లు, గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్, అవదూత దశరథం, గంట్యాల వెంకట నర్సయ్య, కైరంకొండ విఠల్, బింగి మోహన్, రాపెల్లి గురుచరణ్, లక్కవత్రి దేవీదాస్, బల్ల లక్ష్మీబాయి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.